





# చిట్కుల్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక వేడుకలు!

## నీలం మధు ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ సీతారామచంద్రుని ఊరేగింపు

- కేరళ మేళం, కథాకళి, శివ నృత్యాలతో కనువిందు చేసిన ఉత్సవాలు
- మహిళలతో కలిసి కోలాటం ఆడిన నీలం మధు దంపతులు

**పటాన్‌చెరు, మార్చి 23 (జనం పవర్):**

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడవ రోజైన సోమవారం అత్యంత వైభవంగా కొనసాగాయి. సోమవారం ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గోపూజ, మూలమంత్ర అనుష్ఠానములు, పురుష సూక్త హవనములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీలం మధు దంపతులు స్వయంగా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### పురవీధుల్లో భక్తి పారవశ్యం

సోమవారం సాయంత్రం జి టి ఎన్ కాలనీ నుంచి ఐలమ్మ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగిన విగ్రహాల ఊరేగింపు కనువిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. జై శ్రీరామ్ నినాదాలతో పురవీధులు భక్తిభావంతో పులకించిపోయాయి. కేరళ కళాకారుల విన్యాసాలు, శివ తాండవ నృత్యాలు, ఆంజనేయుడి వేషధారణ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి వారి విగ్రహాల ఊరేగింపులో కేరళ నుంచి ప్రత్యేకంగా రప్పించిన కళాకారుల చెండ మేళం గ్రామం అంతటా ప్రతిధ్వనించింది.

### సాంస్కృతిక కళా ప్రదర్శనలు

పురాణ గాథలను కళ్లకు కట్టేలా ప్రదర్శించిన కథాకళి నృత్యం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. శివ తాండవ నృత్యాలు ఊరేగింపునకు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చాయి. ఈ సందర్భంగా శ్రీరామ భక్తి గీతాలకు నీలం మధు దంపతులు మహిళలతో కలిసి కోలాటం ఆడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆద్యంతం కన్నుల పండువగా జరిగిన ఈ ఊరేగింపు వేడుకలను గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జన్నారం ఆసుపత్రిని 30 పడకలకు పెంచాలి

- హెచ్‌ఆర్సీ చైర్‌పర్సన్‌కు వినతి
- మెరుగైన వైద్యం అందేలా చూడాలని టీపీసీసీ నేత రాజేష్ విన్నపం
- ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని పట్టు

**తుడుం జితేందర్ - జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, తద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ స్టేట్ జాయింట్ కన్వీనర్ కత్తెరపాక రాజేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జన్నారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు పెరిగే జనాభాకు ఏమాత్రం సరిపోవడం లేదని, దీనిని తక్షణమే 30 పడకల స్థాయికి పెంచాలని కోరారు. అలాగే రోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న తీవ్రమైన తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, నడవలేని స్థితిలో ఉన్న రోగుల కోసం తగినన్ని వీల్ చైర్ల సౌకర్యం కల్పించాలని విన్నవించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. రాజేష్ విన్నపంపై సానుకూలంగా స్పందించిన హెచ్‌ఆర్సీ చైర్‌పర్సన్.. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సిద్దిపేటలో అడవి పంది కలకలం

- 37వ వార్డులో స్వైర విహారం!
- పలువురిపై దాడి.. గాయపడ్డ బాధితులు
- భయాందోళనలో స్థానిక ప్రజలు
- పట్టించుకోని అటవీ, మున్సిపల్ అధికారులు

**సిద్దిపేట, మార్చి 23 (జనం పవర్ ప్రతినిధి):**

సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో అడవి పంది ఆందోళనకరంగా సంచరిస్తూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. గత కొన్ని రోజులుగా ఈ అడవి పంది వీధుల్లోకి వచ్చి ప్రజలపై అకస్మాత్తుగా దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లే వారు భయంతో వణికిపోతున్నారు. దూసుకొచ్చే ఈ అడవి పంది దాడిలో గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ వరుస ఘటనలతో 37వ వార్డు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఈ గంభీరమైన విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ఇంకా సరైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడవి పందిని పట్టుకోవడానికి అటవీశాఖతో పాటు మున్సిపల్ సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజల భద్రత కోసం అధికారులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళన వాతావరణం నెలకొంది.





# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వీరభద్ర నగర్ కాలనీలో కోలాహలం!**

**ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత**

**అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండాలి**



**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

సంగారెడ్డి పట్టణంలోని 37వ వార్డు వీరభద్ర నగర్ కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. కాలనీవాసులు సమిష్టిగా నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర, వారి ప్రాధాన్యత గురించి లోతుగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత విచ్చేశారు. ఈ సందర్భంగా కూన వనిత కాలనీ మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ ముందంజలో నిలుస్తున్నారని కొనియాడారు. వారి సాధికారత దిశగా సమాజం మొత్తం చేయి చేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు కాలనీవాసులను విశేషంగా అలరించాయి. యువతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. కాలనీలోని ప్రధాన కూడళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మరణాన్ని ముద్దాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్

**యువతరానికి నిత్య స్ఫూర్తిప్రదాత.. దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం**

**అమరవీరుల 95వ వర్ధంతి వేడుకల్లో ఏఐవైఎఫ్ నేత మహేష్ యాదవ్**



**బెజ్జంకి, మార్చి 23 (జనం పవర్):**

మరణాన్ని సైతం ముద్దాడిన విప్లవ వీరుడు, ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపం, ధీరత్వానికి మారుపేరు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ అని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉప సర్పంచ్ ధూమాల మహేష్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరయోధుడు, యువ విప్లవకారుడు, అమరజీవి సర్దార్ భగత్ సింగ్ భారత స్వాతంత్ర పోరాటంలో వీరోచిత పోరాటాలు నిర్వహించారన్నారు. భగత్ సింగ్ పేరు వింటేనే బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టేదని చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వం లాహోర్ కుట్ర కేసు మోపి జైల్లో నిర్బంధించిందని, 1931 మార్చి 23న కామ్రేడ్ భగత్ సింగ్ తో పాటు ఆయన సహచరులను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందని చెప్పారు. భగత్ సింగ్ వీరమరణం దేశ యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, భారత ప్రజల హృదయాలలో నేటికీ ఆయన నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు బోనగిరి శ్రావణ్, రొడ్డ చరణ్, రావుల రాజు, చిలుముల శ్రీనివాస్, బండిపెల్లి సాయివర్ధన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజల ముంగిటకే న్యాయ సేవలు

**సంగారెడ్డిలో సహాయ కేంద్రం ప్రారంభం**

**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్. ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. శేషగిరిరావు ప్రధాన ఉపన్యాసం చేస్తూ న్యాయ సహాయ కేంద్రాన్ని సమర్థవంతంగా నడపాలంటే ప్రజల పట్ల అంకిత భావం అవసరమని తెలిపారు.

**నిరుపేదలకు న్యాయం అందించడమే ధ్యేయం**



హైకోర్టు న్యాయవాది పద్మారావు మాట్లాడుతూ ప్రజల పరిస్థితులను అర్థం చేసుకొని కేసులను స్వీకరించడం ముఖ్యమని, ఇందుకు సమయం, వ్యయాన్ని కేటాయించే తపన అవసరమని పేర్కొన్నారు. అడ్వకేట్ వి. ప్రభాకర్ మాట్లాడుతూ సమయస్ఫూర్తితో న్యాయ సహాయ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా సామాన్యులకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగేలా సేవలు అందించాలని సూచించారు.

**ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటు**

ఈ సందర్భంగా ఆర్. ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ న్యాయ సహాయ కేంద్రంతో పాటు హెచ్ఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రాన్ని కూడా ప్రారంభించినట్లు తెలిపారు. తన అనుభవాన్ని పంచుకుంటూ ఈ కేంద్రం ద్వారా ప్రజలకు న్యాయం అందించేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నాగేందర్, మధుమోహన్ రెడ్డి, విశ్రాంత ఉద్యోగ నాయకులు సంజీవరావు తదితరులు, వివిధ ప్రాంతాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో నీటి కష్టాలు.. సర్పంచ్ ఉదారత!

- రోగుల దాహార్తి తీర్చిన అజ్మీర కళావతి
- సొంత ఖర్చులతో కూలింగ్ రంజన్ల ఏర్పాటు
- సమస్యను వెలుగులోకి తెచ్చిన 'జనం పవర్'



**తుడుం జితేందర్ - జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. సోమవారం ఉదయం ఆసుపత్రిని సందర్శించిన టీపీసీసీ ఎస్సీ విభాగం జాయింట్ కన్వీనర్ కత్తెరపాక రాజేష్ అక్కడ నెలకొన్న దుస్థితిని చూసి విస్మయం వ్యక్తం చేశారు. నిత్యం వందల సంఖ్యలో వచ్చే రోగులకు కనీసం తాగడానికి మంచినీరు కూడా అందుబాటులో లేకపోవడంపై ఆయన సిబ్బందిని నిలదీశారు. వాటర్ ప్లాంట్ పాడైందని, బడ్జెట్ రాకపోవడం వల్లే మరమ్మతులు చేయించలేకపోతున్నామని సిబ్బంది సమాధానమివ్వడం గమనార్హం. జిల్లా స్థాయి అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి వెళ్తున్నారే తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదని రాజేష్ విమర్శించారు. వెంటనే తన వంతుగా రోగుల కోసం కూల్ వాటర్ తెప్పించి మానవత్వాన్ని చాటుకున్నారు.

**రంగంలోకి 'జనం పవర్'.. సర్పంచ్ సానుకూల స్పందన**

ఈ గంభీరమైన సమస్యను 'జనం పవర్' విలేకరి జితేందర్ స్థానిక సర్పంచ్ అజ్మీర కళావతి నందు నాయక్, సెక్రెటరీ శ్రీపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సర్పంచ్ తక్షణమే స్పందించారు. ఆసుపత్రిలో రోగుల దాహార్తిని తీర్చడానికి వెంటనే రెండు కూలింగ్ రంజన్లను ఏర్పాటు చేయించారు. పంచాయతీ బాడీ నిర్ణయంతో సంబంధం లేకుండా తన సొంత నిధులతోనే ఆసుపత్రికి ఈ సాయం చేస్తానని ఆమె ప్రకటించడం విశేషం. అంతేకాకుండా ప్రతిరోజూ ఆసుపత్రికి నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజల ప్రశంసలు**

సర్పంచ్ తీసుకున్న వేగవంతమైన నిర్ణయంపై రోగులు, వృద్ధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామానికి ఇలాంటి ఆలోచనా దృక్పథం ఉన్న ప్రజాప్రతినిధులు ఉంటే అభివృద్ధి సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, విజయ్, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొని పీహెచ్‌సీలో మరిన్ని మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

- పోన్కల్ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు ఘనంగా సామూహిక సీమంతాలు
- అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆరోగ్య సూత్రాలు పాటించాలని సర్పంచ్ సుష్మా భూమేష్ పిలుపు



**తుడుం జితేందర్ -జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

గర్భిణీ మహిళలు గర్భధారణ సమయంలో సరైన ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ, వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పోన్కల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ తో పాటు ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ పిలుపునిచ్చారు. సోమవారం జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ యూపీఎస్ పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు సామూహిక సీమంతాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు గర్భిణీలకు పండ్లు, పూలు అందజేసి సంప్రదాయబద్ధంగా సీమంతాలు జరిపారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

ఈ సందర్భంగా సర్పంచ్, సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీలకు పలు కీలక సూచనలు చేశారు. శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం ఆకుకూరలు, పండ్లు, పాలు, ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం, గుడ్లు, పాలు వంటి పోషక విలువలున్న ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, ఎంపీఓ జలంధర్ గర్భిణీలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత, వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, ఆయా శాఖల సిబ్బంది, గర్భిణీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలి!

- జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు కల్లుగీత కార్మిక సంఘం వినతి
- బడ్జెట్ లో జరిగిన అన్యాయంపై నేతల ఆగ్రహం
- ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్



**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికులకు జరిగిన అన్యాయంపై సోమవారం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. 2026-27 బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్ లో కేటాయించిన 93 కోట్లలో ఇప్పటి వరకు కేవలం 17 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగిలిన 76 కోట్లు ఈ నెల చివరి నాటికి ఇవ్వాలని కోరారు.

**సంక్షేమ పథకాల అమలులో జాప్యం**

రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్న కల్లుగీత వృత్తిపై ప్రభుత్వం పునరాలోచించాలని నేతలు సూచించారు. 50 ఏళ్లు నిండిన వేలాది మందికి పింఛన్లు రావడం లేదని, ప్రమాదంలో మరణించిన లేదా వికలాంగులైన వారికి ఎక్స్ గ్రేషియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఎక్స్ గ్రేషియాను 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని, వృత్తి పింఛనును 2000 నుంచి 4000 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు.

**వృత్తిదారుల అభివృద్ధికి సహకరించాలి**

560 సంఖ్య గల ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి సొసైటీకి 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని, భూమి లేని చోట కొని ఇవ్వాలని కోరారు. జిల్లాలో తాటి, ఈత, నీరా ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, సభ్యత్వం ఉన్న ప్రతి కార్మికుడికి ద్విచక్ర వాహనం, కాటమయ్య రక్షణ కిట్లను అందించాలని స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కేటాయించిన 12,511 కోట్లు ఏ మాత్రం సరిపోవని, వృత్తిదారుల కోసం 25 వేల కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా నాయకులు రామా గౌడ్, యాద గౌడ్, చెన్నా గౌడ్, నరసింహా గౌడ్, అంజా గౌడ్, వెంకటేశం గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నవధాన్యాలతోనే భూసార రక్షణ

**జమ్మికుంట, మార్చి 23 (జనం పవర్):**

ప్రకృతి వ్యవసాయం ద్వారానే భూసారాన్ని కాపాడుకోవచ్చని ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం సైదాబాద్ గ్రామంలో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నవధాన్యాల సాగు వల్ల నేలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. జీవామృతం, ఘన జీవామృతం తయారీతో పాటు కషాయాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ రమాదేవి, ఉదయ్ పాల్గొన్నారు.



# అడవి బిడ్డల సంక్షేమమే లక్ష్యం

- గిరిజన గూడాల్లో జస్టిస్ షమీమ్ అక్తర్ సందడి
- పాఠశాలలు, ఆసుపత్రులు, శిక్షణ కేంద్రాల తనిఖీ
- విద్యార్థులకు ఉపాధ్యాయురాలిగా మారి పాఠాలు చెప్పిన చైర్‌పర్సన్
- సమయపాలన పాటించని సిబ్బందిపై హెచ్చరిక



**తుడుం జితేందర్-జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

గిరిజన గూడాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా వారి హక్కుల రక్షణకు పెద్దపీట వేస్తామని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఉద్ఘాటించారు. సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఆమె సుడిగాలి పర్యటన చేశారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా నేరుగా పాఠశాలలు, ఆసుపత్రులు, శిక్షణ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా సమీక్షించారు.

**అక్షర సేద్యం.. ఆటల వినోదం!**

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన జస్టిస్ షమీమ్ అక్తర్ కాసేపు ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. విద్యార్థులను సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతూ వారి అభ్యాసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. చదువు ఎంత ముఖ్యమో శారీరక దారుఢ్యానికి ఆటలు కూడా అంతే ముఖ్యమని, ప్రతిరోజూ క్రీడలను పాఠ్యాంశంలో భాగంగా చేయాలని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందా లేదా అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

**వైద్య సేవల్లో మానవీయ కోణం**

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సందర్భంగా ఆమె వైద్యులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, సమయపాలన పాటించని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న కనీస సౌకర్యాల గురించి ఆరా తీశారు.

**వెదురు కళకు ఊపిరి..**

కవ్వాల్ వెదురు ఉత్పత్తుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించినప్పుడు అక్కడి కళాఖండాలు ఆమెను ఆకట్టుకున్నాయి. అడవిలో లభించే వనరులతో అద్భుతాలు సృష్టిస్తున్న గిరిజనులను ఆమె అభినందించారు. వెదురు, తునికాకు, ఇప్పపువ్వు వంటి అటవీ ఉత్పత్తులే గిరిజనుల జీవనాధారమని, వాటికి ఆధునిక హంగులు అద్ది మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

**వినతుల వెల్లువ.. ఘన సన్మానం**

పర్యటన సందర్భంగా పలువురు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాక్టర్ అసోసియేషన్ వారు తమ వృత్తిపరమైన ఇబ్బందులను వివరించగా.. ఆసుపత్రిలో వీల్ చైర్లు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలని టీపీసీసీ ప్రతినిధులు కోరారు. మండలంలో పెచ్చుమీరుతున్న కోతుల బెడదను నివారించాలని అభివృద్ధి కమిటీ వినతిపత్రం అందజేసింది. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు, డీటీడీఓ రమాదేవి, తహసీల్దార్ రామ్మోహన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిద్దిపేటపై సీఎం రేవంత్ రెడ్డి వివక్ష

- బీఆర్ఎస్ నేతల ఆగ్రహం
- అభివృద్ధిని పక్కన పెట్టి రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం
- అంబేడ్కర్ చౌరస్తాలో చర్చకు రావాలని ముఖ్యమంత్రికి సవాల్



**సిద్దిపేట, మార్చి 23 (జనం పవర్ ప్రతినిధి):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనలో అభివృద్ధిపై దృష్టి సారించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు విమర్శించారు. సిద్దిపేటలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి సిద్దిపేట అభివృద్ధిని ప్రశంసించాల్సింది పోయి ఈర్ష్యతో వ్యవహరించారని ఆరోపించారు. ఇదే ఫ్యాక్టరీని తన నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటు చేయాలని వేదికపైనే వ్యాఖ్యానించడం ఆయన మనస్తత్వాన్ని వెల్లడిస్తోందని అన్నారు. గతంలో టీ. హరీష్ రావు, కే. చంద్రశేఖర్ రావు హయాంలో సిద్దిపేటలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టులకు నిధులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే మంజూరయ్యాయని తెలిపారు. గత 27 నెలల పాలనలో సిద్దిపేటకు ఎన్ని నిధులు కేటాయించారో ప్రజలకు చెప్పాలని, అంబేద్కర్ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ముఖ్యమంత్రిని సవాల్ చేశారు. సిద్దిపేటకు సంబంధించిన రూ.1070 కోట్ల అభివృద్ధి పనులను నిలిపివేయడం ప్రాంతంపై వివక్షకే నిదర్శనమని అన్నారు. వెటర్నరీ కాలేజీని ఇతర ప్రాంతానికి తరలించినట్లే పామాయిల్ ఫ్యాక్టరీపై కూడా అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, శిల్పారామం వంటి ప్రాజెక్టులు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించినవేనని పేర్కొన్నారు. నర్మెట్ట సభలో ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శిస్తూ వాటిపై అంబేద్కర్ సర్కిల్‌లో చర్చకు సిద్ధమని తెలిపారు. ఇప్పటికైనా సిద్దిపేట అభివృద్ధికి సహకరించి నిలిపివేసిన నిధులను విడుదల చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుండు భూపేష్, కురా మాణిక్య రెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, సారయ్య, ఎల్లారెడ్డి, లింగం గౌడ్, సోమోరెడ్డి చిన్నా, మోహన్ లాల్, పూజల వెంకటేశ్వర్ రావు, ఆంజనేయులు, రెడ్డి ప్రభాకర్, మెరుగు మహేష్, అజీజ్, రాజేందర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ విద్యుత్ కనెక్షన్‌పై విచారణ జరిపించాలి


- సామాజిక కార్యకర్త సన్నీ ఎడ్వర్డ్ డిమాండ్
- ఏఈ శ్రీనివాస్ అక్రమాలకు సహకరిస్తున్నారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినందుకు హేమలత బెదిరింపులకు దిగుతోందని వెల్లడి


**కరీంనగర్, మార్చి 23 (జనం పవర్):**

స్థానిక 20వ డివిజన్ రేకుర్తి పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మీటర్ అమర్చారని సామాజిక కార్యకర్త సన్నీ ఎడ్వర్డ్ ఆరోపించారు. వేదాంతం హేమలతకు చెందిన ఇంటి నెంబర్ మున్సిపల్ రికార్డుల్లో ఆన్లైన్లో లేకున్నప్పటికీ ఇంటి వెనుక భాగం నుంచి కనెక్షన్ ఇవ్వడం వెనుక కొత్తపల్లి సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ హస్తం ఉందని విమర్శించారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఫిర్యాదుదారుడిపై బెదిరింపులు**

ఈ అక్రమ కనెక్షన్ విషయంపై తాను విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కు ఫిర్యాదు చేశానని సన్నీ ఎడ్వర్డ్ తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటి నుంచి వేదాంతం హేమలత ఇతరుల ద్వారా తనను బెదిరింపులకు గురి చేస్తోందని ఆయన వెల్లడించారు. అసిస్టెంట్ ఇంజనీర్ పై విచారణ జరపకుండా అధికారులు ఆయనకు సహకరిస్తుండటంతోనే ఇలాంటి బెదిరింపులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.





**అవినీతి ఆరోపణలు.. నిబంధనల ఉల్లంఘన**

గతంలో కూడా అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఒక విద్యుత్ స్తంభం కోసం తనను ముప్పై వేల రూపాయలు లంచం అడిగారని సన్నీ ఎడ్వర్డ్ గుర్తు చేశారు. అప్పట్లో పై అధికారులకు ఫిర్యాదు చేయడంతోనే పని జరిగిందని, అయినా సదరు అధికారి తీరు మారలేదని మండిపడ్డారు. అదే ప్రాంతంలోని ఇతర వినియోగదారుల దరఖాస్తులను తిరస్కరిస్తున్న ఏఈ, హేమలత అప్లికేషన్ ను ఏ ప్రాతిపదికన అనుమతించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

హేమలత ఇంటికి విద్యుత్ సరఫరా చేయడానికి ఐదు స్తంభాలు అవసరమవుతాయని, అందుకు లక్షా యాభై వేల రూపాయల వరకు ఖర్చవుతుందని గతంలో లైన్మన్ చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఆ చలాన్ కట్టకుండా తప్పించుకోవడానికి ఇంటి వెనుక ఉన్న తోటలో నుంచి వైర్లు లాగడం దారుణమన్నారు. నిబంధనలను అతిక్రమించి కనెక్షన్ ఇచ్చిన ఏఈ శ్రీనివాస్ పై శాఖాపరమైన విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సన్నీ ఎడ్వర్డ్ విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు.

# ఆలయ ఫౌండేషన్ దాతృత్వం

**బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత**

**కష్టాల్లో ఉన్న మంగలి సదానందం కుటుంబానికి పదివేల రూపాయల సాయం**

**జన్మభూమిపై మమకారంతో సేవలు అందిస్తున్న కలెక్టర్ నరహరి: గుణసాగర్**



**జమ్మికుంట, మార్చి 23 (జనం పవర్):**

వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన కొత్తగట్టు సదానందం మంగలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల వారి కూతురు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. ఈ క్రమంలో ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కష్ట కాలంలో తమకు అండగా నిలిచిన గుణసాగర్ తో పాటు ఫౌండేషన్ డైరెక్టర్, కలెక్టర్ పరికిపండ్ల నరహరికి సదానందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుణసాగర్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వికలాంగులకు జైపూర్ ఫుట్, వృద్ధులకు వీల్ చైర్లు, పేద విద్యార్థులకు సాయం, ఉచిత వైద్య శిబిరాలతో పాటు తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న పరికిపండ్ల నరహరి తన జన్మభూమిపై మమకారంతో ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాదె గుణసాగర్ నేత, శివాలయం చైర్మన్ పల్లెబోయిన రాజ్ కుమార్ యాదవ్, అందె కుమార్, జీడీ వెంకటస్వామి, మారముల్లా సోను, బూర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

**మార్చి 25న నల్ల బ్యాడ్జీలతో పెన్షనర్ల భారీ నిరసన**

**కలెక్టరేట్ల వద్ద ప్రధానికి విజ్ఞాపన పత్రాల సమర్పణ**

**జనగామ, మార్చి 23 (జనం పవర్):**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు చట్టంగా మారడం లక్షలాది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు పెనుభూతంలా మారిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, జాలి మహేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ చట్టం పెన్షనర్లకు ముప్పు వాటిల్లే గొడ్డలి పెట్టు లాంటి చర్య అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం ద్వారా పెన్షనర్లను రెండు వర్గాలుగా విభజించడం శోచనీయమని వారు పేర్కొన్నారు. 2026 జనవరి 1వ తేదీ కంటే ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఎలాంటి వేతన పెంపుదల లేకపోవడం, కరువు భత్యాన్ని కూడా నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. కేవలం వారు రిటైర్డ్ అయిన రోజున ఉన్న పెన్షన్ ను మాత్రమే చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించడం పెన్షనర్ల అస్తిత్వానికే ముప్పు అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ మార్చి 25న ఉదయం 11 గంటలకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ద్వారా, రెవెన్యూ డివిజన్లలో ఆర్డీఓల ద్వారా, మండల కేంద్రాల్లో తహసీల్దార్ల ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞాపన పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో పెన్షనర్లందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు తమ ప్రకటనలో కోరారు.

# విద్యార్థులకు సకల వసతులు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు**

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారుల పర్యవేక్షణ**




**వేల్పుల నగేష్ - జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన స్వయంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

**పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట నిఘా**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, గదుల్లో తగినంత వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలల వసతి ఉండేలా చూస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల నిమిత్తం అవసరమైన మందులతో పాటు వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భగత్ సింగ్ వర్ధంతి..

**నివాళులర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి**

**దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు భగత్ సింగ్**

**అన్యాయాలపై పోరాడటమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి: శ్రీధర్ మహేంద్ర**



**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

దేశ స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ విగ్రహానికి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఆంగ్లేయులపై విప్లవ పోరాటం చేసిన మహనీయుడు భగత్ సింగ్ జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, వివక్షపై యువత పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే యువత బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఉపాధ్యక్షులు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, సహ కార్యదర్శి గడ్డం పాండురంగం, సభ్యులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సదాశివపేట గురుస్వామి మృతి

**చిత్తూరు వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో కన్నుమూత**

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంతాపం.. పట్టణంలో విషాదం**

**సదాశివపేట, మార్చి 23 (జనం పవర్):**



చిత్తూరు వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సదాశివపేటకు చెందిన ప్రముఖ గురుస్వామి నాయుడు మృతి చెందారు. కారు, బైక్ ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నాయుడు మరణవార్త తెలియగానే సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నాయుడు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పోలీస్ స్టేషన్ ముందే రణరంగం

**సినిమా చూస్తూ ఉండిపోయిన ఖాకీలు!**

**మద్దికుంట తండా వాసుల మధ్య చెలరేగిన ఘర్షణ.. తీవ్ర ఉద్రిక్తత**

**పట్టించుకోని పోలీసుల తీరుపై స్థానికుల ఆగ్రహం.. ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్**



**సదాశివపేట, మార్చి 23 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని మద్దికుంట తండా వాసుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒక కేసు వివాదం నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చెలరేగి అది చివరికి పోలీస్ స్టేషన్ ముందే రణరంగంగా మారింది. సమస్య పరిష్కారం కోసం రెండు కుటుంబాలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా అక్కడి పోలీసులు న్యాయం చెప్పాల్సిన బదులు బయటకు వెళ్లి మాట్లాడుకుని ఒప్పందం చేసుకుని రండి అంటూ పంపించారని సమాచారం. అయితే స్టేషన్ బయటకు వచ్చిన వెంటనే వాగ్వాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరుకుంది. పోలీస్ స్టేషన్ ముందే ఈ ఘర్షణ జరిగినప్పటికీ దాన్ని అదుపులోకి తీసుకురావాల్సిన పోలీసు సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడే ఉన్న సిబ్బంది ఘటనను పట్టించుకోకుండా మొబైల్‌లో సినిమా చూస్తూ ఉండిపోయారనే విషయం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. శాంతిభద్రతలను కాపాడాల్సిన వారే ఇలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల రక్షణకు ఉన్న పోలీసులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భద్రత ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటన ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలని బాధితులు కోరుతున్నారు.




# ప్రపంచ ఆధిపత్యం కోసమే అమెరికా దాడులు

- సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మాణిక్
- భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం సాగించాలి
- పాశమైలారంలో ఘనంగా విప్లవ వీరుడి 95వ వర్ధంతి వేడుకలు




**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

ప్రపంచ ఆధిపత్యం కోసమే అమెరికా సామ్రాజ్యవాదం దాడులు చేస్తోందని, భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మాణిక్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా పాశమైలారం పారిశ్రామిక వాడలోని బీపీఎల్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి భారతదేశ విముక్తి కోసం 23 ఏళ్ల అతి చిన్న వయసులోనే ప్రాణ బలిదానం చేసిన గొప్ప విప్లవ వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు.

**సోషలిస్టు వ్యవస్థతోనే సమ సమాజం**

దేశానికి స్వాతంత్రం వస్తేనే సరిపోదని, ప్రజలందరికీ కూడు, గుడ్డ, గూడు, విద్య, వైద్యం అందాలని భగత్ సింగ్ ఆకాంక్షించారని మాణిక్ గుర్తు చేశారు. కానీ నేటి పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం, పేదరికం, దారిద్ర్యం తాండవిస్తున్నాయని విమర్శించారు. సమానత్వం, కుల రహిత సమాజం కోసం భగత్ సింగ్ కన్న కలలు కేవలం సోషలిస్టు వ్యవస్థలోనే సాధ్యమవుతాయని ఆయన నమ్మారని తెలిపారు. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదం లాగే నేడు అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చలాయించాలని చూస్తోందని మండిపడ్డారు.

**మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలి**

భారతదేశాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ ప్రభుత్వం తాకట్టు పెడుతోందని మాణిక్ ఆరోపించారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కిర్బీ, పార్లే, ఎనర్జీ, సువెన్ వంటి వివిధ పరిశ్రమల కార్మికులు భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రాజు, శాంత కుమార్, ఇండస్ట్రియల్ క్లస్టర్ నాయకులు జైపాల్, వెంకటేష్, దుర్గేష్, శ్రీనివాస్ గౌడ్, భాస్కర్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.





# ప్రభుత్వ భూమిలో అక్రమ ఇళ్ల దందా!

- కలెక్టరేట్ ప్రజావాణిలో రేశం యాదగిరి ఫిర్యాదు
- నిబంధనల విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు.. కూల్చివేతకు డిమాండ్

**కరీంనగర్, మార్చి 23 (జనం పవర్):**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ సర్వే నెంబర్ 439లో గల అక్రమ ఇంటి నెంబర్లను వెంటనే రద్దు చేయాలని ప్రగతినగర్ డెవలప్మెంట్ కమిటీ నాయకుడు రేశం యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇంటి నెంబర్లు పొందారని ఆరోపించారు.

**అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం**

కొమ్మెర సునీత దేవికి గతంలో కేటాయించిన భూమి వివరాలను తప్పుగా చూపి పక్కనే ఉన్న 17 గుంటల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారని యాదగిరి పేర్కొన్నారు. 2012లోనే ఆమెకు ఉన్న భూమిని పూర్తిగా విక్రయించినా.. పాత పత్రాలతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. ఈ వ్యవహారంపై లోకాయుక్త సైతం స్పందించి మున్సిపల్ అధికారులను సంప్రదించమని సూచించినట్లు తెలిపారు.

**ఇళ్ల కూల్చివేతకు డిమాండ్**

అక్రమంగా పొందిన 21-11-101 వంటి వివిధ ఇంటి నెంబర్లను వెంటనే రద్దు చేయాలని యాదగిరి కోరారు. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను వెంటనే కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కలెక్టర్ ను వేడుకున్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# యుద్ధాల నియంత్రణకు అంతర్జాతీయ చర్చలు జరగాలి!

- బాంబు దాడులను ఆపడానికి ప్రధాని మోదీ చొరవ చూపాలి
- ఏప్రిల్ లో 'ఇంటింటికీ సీపీఐ'.. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపు




**కరీంనగర్, మార్చి 23 (జనం పవర్):**

ప్రపంచ వ్యాప్తంగా ఒక దేశంపై మరొక దేశం యుద్ధాలు, దాడులు చేయకుండా ఉండాలంటే అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని, తక్షణమే ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకోవాలని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హితవు పలికారు. అదే స్థాయిలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ కూడా చొరవ చూపాలన్నారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం వివరాలను జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ వెల్లడించారు.

**సామాన్యులపై భారాలు వద్దు**

ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు జరుపుతున్న బాంబు దాడుల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వంట గ్యాస్ ను బ్లాక్ మార్కెట్ కు తరలించి కొరత సృష్టించడం వల్ల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుందని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల కొరత లేకుండా చూడాలని, బాంబు దాడుల నియంత్రణకు ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సంప్రదింపులు జరపాలని సూచించారు.

**వైఫల్యాలపై ధ్వజం**

పార్లమెంటు సమావేశాల్లో ఎక్కువ రోజులు పాల్గొన్నానని చెప్పుకునే ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాల కోసం ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. దేశంలో నిరుద్యోగం తగ్గలేదని, నల్లధనం వెలికి తీయలేదని విమర్శించారు. బీజేపీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమై కార్పొరేట్ సంస్థలు బాగుపడ్డాయని, అదానీ, అంబానీల ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం నిత్యావసరాల ధరలపై దృష్టి పెట్టలేదని, లేదంటే ప్రజలపై ఇప్పటికే భారీ భారం మోపేవారని విమర్శించారు.

**ఏప్రిల్ లో ఇంటింటికీ సీపీఐ**

సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెలలో 'ఇంటింటికీ సీపీఐ' అనే నినాదంతో నిర్వహించే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు సభ్యత్వాన్ని పెంచాలని, అన్ని గ్రామాలు, మండలాల్లో ప్రజా సంఘాలను విస్తరించి మహాసభలు జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు తుది గడువు!

**సంగారెడ్డి, మార్చి 23 (జనం పవర్):**

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి అధికారులు కీలక సమాచారం అందించారు. ఈ నెల 24వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఏడీ రామాచారి తెలిపారు. అర్హులైన షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు తప్పనిసరిగా గడువు లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఆసక్తి గల వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అలాగే దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసి సంబంధిత ఎంపీడీవో లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణలోకి తీసుకోరని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



